నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం | అక్టోబర్ 07, 2024 | www.navatelangana.com

లారీని ఢీకొన్న ద్విచక్రవాహనం

- ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-జైనథ్



అమ్మవారి దర్శనానికి వెళ్ళొస్తూ మార్గమధ్యంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఎస్సై పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం... ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన హర్షవర్ధన్, నీరజ్‌రెడ్డి స్కూటీపై కేళాపూర్ అమ్మవారి దర్శనానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా ఆదివారం ఉదయం పిప్పర్‌వాడ దగ్గర ఆగిఉన్న లారీని ఢీకొట్టారు. ఈ ఘటనలో హర్షవర్ధన్ అక్కడికక్కడే మరణించగా నీరజ్‌కు గాయాలయ్యాయని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నవతెలంగాణ-ఇచ్చోడ

మతిస్థిమితం లేని, గుర్తు తెలియని మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన మండల కేంద్రంలోని నిర్మల్ బైపాస్ జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. సీఐ భీమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని, మతిస్థిమితం లేని మహిళ రోడ్డు పక్కన తిరుగుతున్న సందర్భంలో శనివారం అర్ధరాత్రి మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందినట్టు ప్రత్యక్ష సాక్షి తెలిపినట్లు తెలిపారు. సాక్షి తెలిపిన వివరాల ప్రకారం అదే సమయంలో ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న మహారాష్ట్రకు చెందిన బస్సు ఢీకొట్టినట్లు అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో మార్చురీకి తరలించినట్లు సీఐ భీమేష్ తెలిపారు. మృతి చెందిన మహిళకు సుమారు 55సంవత్సరాలు ఉండవచ్చన్నారు. సంబంధించిన వారు ఎవరైనా ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

భర్తీ అవుతున్నా..కొరత తీరలే.!

- తాజాగా నియామకమయ్యేవి 324 పోస్టులు మాత్రమే
- జిల్లాలో మరో 301 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ
- తాత్కాలిక బోధకులు..లేదంటే డీఎస్సీ ద్వారానే పరిష్కారం
- ఏండ్లుగా సర్కారు బడులను వెంటాడుతున్న బోధకుల లేమి

విద్యావ్యవస్థలో ప్రభుత్వాలు తీసుకొస్తున్న నామమాత్రపు సంస్కరణలతో సమస్యలు దూరం కావడం లేదు. ఏండ్లుగా సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. సర్కారు బడుల్లో బోధకుల కొరత తీర్చేందుకు ప్రభుత్వం ఉపాధ్యాయుల నియామకం చేపట్టినా ఈ సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం కావడం లేదు. తాజాగా చేపట్టిన డీఎస్సీతో జిల్లాలో కేవలం 324 పోస్టులు మాత్రమే భర్తీ అవుతున్నాయి. కానీ ఇంకా 301 పోస్టులు ఖాళీగా ఉండటంతో బోధకుల నియామకం అనివార్యమవుతోంది. ఈ సమస్య పరిష్కారానికి తాత్కాలికంగా విద్యావాలంటీర్లను నియమించడమా.. లేదంటే త్వరలోనే మరో డీఎస్సీ నిర్వహించి శాశ్వత ప్రతిపాధికన నియమించడమా అనే దానిపై ప్రభుత్వం దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులు ఆయా ప్రాంతాల్లో నియమించబడినా..ఇంకా అనేక బడుల్లో పోస్టులు ఖాళీగా ఉండటంతో టీచర్ల కొరత తీరడం లేదు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

విద్యావ్యవస్థలో ఉపాధ్యాయులే కీలకం. కానీ చాలా బడుల్లో బోధకుల కొరత వేధించడంతో వేలాది మంది పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందని ద్రాక్షగానే మారుతోంది. జిల్లాలో ఏండ్లుగా ఉపాధ్యాయుల కొరత వేధించడం మూలంగా అనేక మంది పిల్లలు ప్రయివేటు బాట పడుతున్నారు. ప్రభుత్వాలు వీటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోకపోవడం మూలంగా సర్కారు బడుల పరిస్థితి దయనీయంగా మారుతోంది. గత ప్రభుత్వం చివరి సారిగా 2017లో ఉమ్మడి జిల్లా యూనిట్‌గా టీఆర్‌టీ ద్వారా 1582 పోస్టులను భర్తీ చేసిన ప్రభుత్వం ఏడేండ్ల అనంతరం తాజాగా 1295 పోస్టులను భర్తీ చేస్తోంది. కానీ ఏండేండ్లలో అనేక మంది ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందడంతో అక్కడ ఏర్పడిన ఖాళీలు భర్తీకి నోచుకోలేదు. కానీ గత ప్రభుత్వం నిర్ణయించిన మూడేండ్ల ఉద్యోగ విరమణ పెంపుతో ఇన్నాండ్లు కొంత ఇబ్బందులు లేకపోయినా ఈ ఏడాది మార్చి నుంచి ఉద్యోగ విరమణలు ప్రారంభమయ్యాయి. దీంతో అనేక మంది ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందుతున్నారు. మరోపక్క విద్యాశాఖ ఇటీవల చేపట్టిన బదిలీలు, పదోన్నతులతో మరిన్ని ఖాళీలు ఏర్పడటం సర్కారు బడులకు ఇబ్బందికరంగా మారింది.

ఉపాధ్యాయుల కొరత తీర్చాలి



వి.అశోక్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

డీఎస్సీ ద్వారా ఎంపికైన అభ్యర్థులను వెంటనే పాఠశాలల్లో నియమించాలి. వీరి నియామకం తర్వాత మిగిలిపోయిన ఖాళీలను భర్తీ చేసేందుకు విద్యావాలంటీర్లను నియమించాలి. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మరో డీఎస్సీ నిర్వహించి మిగితా ఖాళీలను సైతం భర్తీ చేయాలి. ఉపాధ్యాయులకు నెలవారీ పదోన్నతులు కల్పించాలి. ఎప్పటికప్పుడు ఖాళీలను భర్తీ చేయాలి.



మరో 301 పోస్టులు అవసరం..!

జిల్లాలో బదిలీలు, పదోన్నతులు, ఉద్యోగ విరమణలతో ఏర్పడిన ఖాళీల వివరాలను తెలుసుకునేందుకు విద్యాశాఖ ఇటీవల లెక్కలు తీసింది. జిల్లాలో 3042 పోస్టులు మంజూరు కాగా ప్రస్తుతం 2422 మంది ఉపాధ్యాయులు మాత్రమే పనిచేస్తున్నారు. దీంతో జిల్లాలో ఇంకా 625 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. తాజాగా చేపట్టిన డీఎస్సీలో జిల్లాలో 324 పోస్టులు భర్తీ కానున్నాయి. ఇప్పటికే అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తిచేసి ఎంపిక ప్రక్రియ పూర్తికావడంతో ఈ నెల 9న వారికి నియామకపత్రాలు అందించనున్నట్లు తెలిసింది. దీంతో దసరా సెలవుల అనంతరం కొత్త ఉపాధ్యాయులు బడులకు వెళ్లనున్నారు. కానీ ఈ పోస్టులు భర్తీ అయినప్పటికీ మరో 301 పోస్టులు ఖాళీగా మిగిలిపోవడంతో తాత్కాలిక బోధకుల నియామకం అనివార్యమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ సమస్య పరిష్కారం కోసం విద్యావాలంటీర్లను నియమించడమా.. లేదంటే తక్షణం మరో డీఎస్సీ వేసి మిగితా పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం ఉంది. లేదంటే సర్కారు బడుల్లో చదివే పేద పిల్లలకు పాఠాలు చెప్పేవారు లేక నష్టపోయే పరిస్థితి ఉంటుంది. మిగితా కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోనూ ఉపాధ్యాయుల కొరత కనిపిస్తోంది.

మహిళా చట్టాల అమలులో నిర్లక్ష్యం

- ఐద్వా కేంద్ర కమిటీ సభ్యురాలు ఆశాలత



నవతెలంగాణ-కాగజ్‌నగర్

మహిళల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను తీసుకువస్తున్నా, వాటి అమలులో పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని ఆలిండియా ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఐద్వా) కేంద్ర కమిటీ సభ్యురాలు ఆశాలత అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని బాలభారతి పాఠశాలలో ఐద్వా ప్రథమ మహాసభ నిర్వహించారు. ముందుగా ఐద్వా సీనియర్ నాయకురాలు మమతారాణా జెండ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆశాలత మాట్లాడుతూ మహిళా చట్టాలను తీసుకురావడమే తప్ప వాటి అమలులో చిత్తశుద్ధి కనపర్చడం లేదని అన్నారు. మహిళా చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తేనే మహిళల హక్కులు పరిరక్షించబడుతాయని అన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా మాచర్ల వినోద, కార్యదర్శిగా దుర్గం అనిత, కోశాధికారిగా ముంజం సుధారాణితో పాటు మరో ఎనిమిది మందిని జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆలిండియా అగ్రికల్చర్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ముంజం ఆనంద్‌కుమార్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వి.కృష్ణమాచారి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చాపిలె సాయికృష్ణ, నాయకులు వసాకె సాయి పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్‌లు లబ్ధిదారులకు అందజేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్



నవతెలంగాణ-జైనథ్



మండలంలోని రాంపూర్(టి) గ్రామంలో ఆదివారం సీపీఐ(ఎం)శాఖ రెండో మహాసభలు ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను సీనియర్ సభ్యులు వెంకన్న ఆవిష్కరించారు. అనంతరం పార్టీ శాఖ కార్యదర్శి గంగన్న అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ గ్రామంలో గత ఆరు సంవత్సరాలుగా డబుల్ బెడ్ రూమ్‌ల నిర్మాణం నత్తనడకన కొనసాగుతుందని అన్నారు. ఇప్పటి వరకు ఇండ్ల నిర్మాణం పూర్తి కాకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కాంట్రాక్టర్ ఇండ్లను పూర్తి చేయడంలో పక్షపాతంగా వ్యవహరిస్తున్నారనీ ఆరోపించారు. వెంటనే డబుల్ బెడ్ రూమ్‌ల నిర్మాణం పూర్తి చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రామంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి శాఖ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించడానికి మహాసభల్లో కార్యాచరణ రూపొందించ నున్నట్టు పేర్కొన్నారు. అనంతరం నూతన శాఖ కార్యదర్శిగా ఎం.గంగన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జి.స్వామి, ఏ.స్వామి పాల్గొన్నారు.

నిన్న అలా.. నేడు ఇలా..

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జాతీయ రహదారి నుండి జిల్లా కేంద్రంలోకి ప్రవేశించే ప్రవేశ దారి వద్ద వాహనాలు ఎడమవైపు తిరిగే విధంగా రోడ్డు మధ్యలో గతంలో పోలీసులు తాత్కాలిక డివైడర్ అమర్చగా జైనుర్ ఘటన నేపథ్యంలో తాత్కాలిక డివైడర్లు అక్కడికి తీసుకువెళ్లారు. దీంతో ప్రవేశ ద్వారం వద్ద దారిని విభజిస్తూ డివైడర్లు లేకపోవడంతో వాహనదారులు ఇష్టమొచ్చినట్లు వెళ్తుండటంతో సీఐ సతీష్ జాతీయ రహదారి అధికారులతో మాట్లాడి సిమెంటు ప్లేట్లతో రహదారిపై డివైడర్లు ఏర్పాటు చేశారు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం తగ్గడంతో పాటు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు కూడా పాటిస్తూ ఎడమవైపు తిరుగుతున్నారు.



నిన్న



నేడు

ఆదివాసులు ప్రకృతినే పూజిస్తారు

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

భారతదేశం భిన్న సంస్కృతి సాంప్రదాయాలకు నిలయమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని పీఎమ్మార్సీ భవనంలో ఓయోస్టర్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రైబల్ అడ్వెంచర్ క్యాంపులో పాల్గొన్నారు. ముందుగా వివిధ యూనివర్సిటీలలో చదువుతున్న విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆదివాసుల సంస్కృతి సాంప్రదాయాలు ఇతరుల కంటే భిన్నంగా ఉంటాయని, ప్రకృతినే దైవంగా భావించి, నిత్యం పూజలు చేస్తుంటారని పేర్కొన్నారు. పెర్సాపేన్, జంగుబాయి, బీమల్ దేవ్, అవ్వల్, పద్మల్‌పూరి, కాకోబాయి, ఆదివాసుల దేవతలని, సహజ సిద్ధంగా తయారు చేసిన నవధాన్యాలతో పూజలు చేయడం తరతరాలుగా వస్తున్న ఆచారమని పేర్కొన్నారు. తాము అడవినే నమ్ముకుని జీవితాన్ని గడుపుతామని తెలిపారు. దండారి ఉత్సవాలు ఆదివాసులకు ప్రత్యేకమని అన్నారు. ఇందులో కోలాటం ఆడటం పాటలు పాడటం జరుగుతుందన్నారు. తాను సామాన్య రైతు కుటుంబంలో జన్మించి, ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని, ఉన్నత చదువులు చదువుకుని పేపర్‌బాయ్ స్థాయి నుంచి ఎమ్మెల్యేగా ఎదిగానని తెలిపారు. ఇందిరమ్మ ఇంట్లో ఉన్న తనను చట్టసభల్లో వెళ్లడానికి సీఎం రేవంత్‌రెడ్డి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించారని తెలిపారు. పట్టుదల కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చని తెలిపారు. విద్యార్థుల గొప్ప లక్ష్యాన్ని పెట్టుకోని, అదిశగా అడుగులు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓయోస్టర్ సంస్థ సభ్యులు శ్రీధర్, సునీల్, సోహెల్, రజిత, అరవింద్ పాల్గొన్నారు.

సొనాల వాసికి స్వామి వివేకానంద జాతీయ అవార్డు



నవతెలంగాణ-బోథ్

మండలంలోని సొనాల గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త రాజ్ కుమార్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలో జరిగిన దక్షిణ భారతదేశ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్నాటక, తెలంగాణ, పాండిచ్చేరి, బహుజన సాహిత్య అకాడమీ ఎనిమిదవ రచయితల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అవార్డును బీఎస్ఏ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా ఆదివారం అవార్డును అందించారు. అలాగే రాజ్ కుమార్ చేసిన సామాజిక సేవలను గుర్తించి, ఆనేక కార్యక్రమాలు గుండెపోటు సీపీఆర్, సైబర్ క్రైమ్ నేరాలు, పర్యావరణ పరిరక్షణ, నవ సమాజాన్ని నిర్మించే ఉపాధ్యాయుని పాత్ర, స్వామి వివేకానంద యువతకు ఇచ్చిన సందేశం, చరిత్రకు సజీవ సాక్షాలు పురాతన నాణాలు, ఆడపిల్లల ఆవశ్యకత వారిని చదవనివ్వండి వారిని ఎదగనివ్వండి అంశాలపైన చేసిన సామాజిక సేవను దృష్టిలో పెట్టుకొని అవార్డును అందించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ రచయితలు పాల్గొన్నారు.

భవనాలు సద్వినియోగపర్చుకోవాలి



- రూ.2కోట్లతో బంజార భవన్ నిర్మాణానికి భూమిపూజ
- పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భవనాలు నిర్మించడంతో పాటు వాటిని సద్వినియోగ పర్చుకోవాలని ఎంపీ గోడం నగేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పిట్టలవాడలో ఎస్టీఎఫ్ఎఫ్ నిధులు రూ.2కోట్లతో నిర్మించే బంజార భవన్ నిర్మాణానికి ఎమ్మెల్యేలు పాయల శంకర్, అనిల్ జాదవ్‌తో కలిసి భూమిపూజ చేశారు. సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం ఇటీవల మరణించిన మాజీ ఎంపీ రాథోడ్ రమేష్‌కు రెండు నిమిషాలు మౌనం పాటించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ సంఘ భవనం నిర్మాణం పూర్తి చేసుకొని వినియోగంలోకి తెవాలన్నారు. భవనాన్ని నిర్మించే వరకు ఉన్న ఉత్సాహం దాన్ని ఉపయోగించడంలో కూడా చూపాలన్నారు. ఇప్పటి వరకు నిర్మించిన సంఘ భవనాలను చూశామన్నారు. గతంలో కమ్యూనిటీ హాలుకి ఎంపీగా తను ఉన్న సమయంలో ఇచ్చిన రూ.5లక్షలతో పిల్లర్లు వేసి ఆగిపోయాయని తెలిపారు. ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి వద్దకు వెళ్లి బంజార అభ్యున్నతికి నిధులు విడుదల చేయాలని విన్నవిస్తానని తెలిపారు. అదే విధంగా కేంద్రం నుంచి రావాల్సిన నిధులను కూడా తీసుకువచ్చేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం ఆల్ ఇండియా బంజార సేవ సంఘ్ జాతీయ అధ్యక్షుడు అమర్ సింగ్ తిలావత్ మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. తన ట్రస్ట్ ద్వారా బంజార పిల్లలకు ఉచితంగా సివిల్స్, గ్రూప్స్ కోసం ఉచితంగా శిక్షణ ఇస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ కొలువుల కోసం ఎదురు చూడొద్దన్నారు. వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటూ దాంట్లో రాణించాలన్నారు. బంజార భవన్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ వారికి ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజార సేవ సంఘ్ జాతీయ అధ్యక్షుడు అమర్ సింగ్ తిలావత్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్, జెడ్పీ మాజీ చైర్మెన్ జనార్దన్ రాథోడ్, కౌన్సిలర్లు పవన్ నాయక్, అర్చన రాంకుమార్, ఉష్కం రఘుపతి, ట్రైబల్ వెల్ఫర్ ఈఈ రాథోడ్ భీంరావ్, ఆర్అండ్ బీ ఈఈ సురేష్, బాబులాల్, రామారావ్ రాథోడ్, హీరాలాల్ నాయక్ ఉన్నారు.

పద్మశాలి సంఘం ఎన్నికలను త్వరలోనే నిర్వహిస్తాం

- సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణ పద్మశాలి సంఘం ఎన్నికలను త్వరలోనే నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు తెలిపారు. ఆదివారం స్థానిక పద్మశాలి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర సంఘంతో పాటు అఖిల భారత పద్మశాలి సంఘానికి అనుబంధంగానే జిల్లా, కాగజ్‌నగర్ పట్టణ సంఘాలు కొనసాగుతాయని, త్వరలోనే పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్ష, కార్యదర్శుల పదవీ కాలం ముగియనుండడంతో ఎన్నికలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణంలో కొంతమంది మరో సంఘం ఏర్పాటైనట్లు ప్రకటనలు ఇస్తున్నారని, దీనిని నమ్మి పద్మశాలి కులస్థులు అయోమయానికి గురి కావద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గడదాసు మల్లయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్ల కనకయ్య, పట్టణ అధ్యక్షుడు కుడిక్యాల రాజమౌళి, ప్రధాన కార్యదర్శి అనుమాండ్ల కేదారి, సంఘం సభ్యులు దోమల సురవర్ధన్, సిందం చంద్రయ్య, సిందం శ్రీనివాస్, సామల రాజయ్య, ఎన్నం అశోక్, మాచర్ల శ్రీనివాస్, బోగ సత్యనారాయణ, అవదూత శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పాదయాత్ర

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని వాసవి కన్యక పరమేశ్వరి ఆలయం నుంచి పాదయాత్ర చేపట్టారు. భక్తి భక్తిశ్రద్ధలతో నవరాత్రి దీక్ష పరులు ఈ యాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి, డీఎస్పీ జీవన్ రెడ్డి, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ ఖత్రి, కౌన్సిలర్ లాలామున్న, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త రాజేశ్వర్, నాయకులు ఉపలంచివారి కృష్ణ, భాను కిరణ్, శివకుమార్, నాలం దిన్కర్, జవ్వాజి కృష్ణ పాల్గొన్నారు.

పంటలకు ప్రాజెక్టు రైట్ కెనాల్ ద్వారా నీటిని వదలాలి

నవతెలంగాణ-తాంసి



మండలంలోని వడ్డాడి ముత్తడి వాగు ప్రాజెక్టుకు నూతనంగా నిర్మించిన రైట్ కెనాల్ పంప్ హౌస్ ద్వారా రైతుల పంట పొలాలకు నీటిని తక్షణమే వదిలి పంటలను కాపాడాలని కోరుతూ ఆదివారం వడ్డాడి గ్రామ రైతులు ముత్తడి వాగు పంప్‌హౌస్ నిర్మాణ ప్రాంతానికి వెళ్లి నీటిని విడుదల చేయాలని, నిరసన తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణం రైతుల పంట పొలాలకు కెనాల్ ద్వారా నీటిని విడుదల చేయాలని ఉద్యేశంతో ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. రైట్ కెనాల్ పనులు పూర్తి అయినట్టు గుత్తేదారు చెబుతున్నారు. కానీ వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నప్పటికీ నీటిని వదలడం లేదన్నారు. గుత్తేదారు ప్రదీప్ కుమార్, ప్రాజెక్ట్ ఏఈ హరీశ్‌ని రైతులు సంప్రదించగా వారు మాట్లాడారు. నీటిని వదలడానికి ఎలాంటి అభ్యంతరం లేనప్పటికీ ఒకరిద్దరి రైతుల అవసరాలకు నీటిని వదలడం కుదరదన్నారు. కనీసం 20 నుంచి 30 ఎకరాల రైతుల పంట పొలాలకు నీటి అవసరం ఉన్నట్టు రైతులు తమ దృష్టికి తీసుకువస్తే తప్పకుండా నీటిని వదలడానికి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. రైతులు మాట్లాడుతూ అవసరం ఉన్న రైతు పంట పొలాలకు కెనాల్ ద్వారా నీటిని తక్షణమే వదలాలని లేనియెడల జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు శ్రీనివాస్, అనీష్, గంగాధర్, తన్విర్, లక్ష్మణ్, పలువురు రైతులు ఉన్నారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నార్నూర్



ఈనెల 8న, పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించే మెఘా వైద్యశిబిరాన్ని ఉమ్మడి మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీఐ రహీమ్ పాషా అన్నారు. ఆదివారం గాదిగూడ మండలంలోని ఝరి ఆశ్రమ పాఠశాలలో నిర్వహించే వైద్య శిబిర స్థలాన్ని సీఐ పరిశీలించారు. ఈ వైద్య శిబిరానికి జిల్లా ఎస్పీ గౌస్ ఆలం హాజరవుతున్నట్టు పేర్కొన్నారు. అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన వైద్యులు అందుబాటులో ఉంటారని, ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని విజయవంతం చేయాలని కోరారు. వారి వెంట ఎస్సై మహేష్, ఆదివాసీ నాయకులు ఉన్నారు.

నీట్‌లో సీటు సాధించిన గ్రీష్మకు సన్మానం

నవతెలంగాణ-ఉట్నూర్



పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన జాదవ్ అనిత, సత్యపాల్ ఉపాధ్యాయ దంపతుల కుమార్తె జాదవ్ గ్రీష్మ నీట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించి, జయశంకర్ భూపాల్‌పల్లి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన సందర్భంగా ఆదివారం గ్రీష్మను బంజారా విద్యానగర్ వాసులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జాటోత్ ఉపేందర్ తహసీల్దార్ దంపతులు, హెల్త్ సూపర్ వైజర్ చౌహన్ చరణ్‌దాస్ దంపతులు మాట్లాడుతూ పిల్లల ఎదుగుదల కోసం తల్లిదండ్రులు పడే కష్టాలు చాలా గొప్పవన్నారు. శ్రద్ధతో చదివి సీటు సాధించడం అభినందనీయమని అన్నారు. డాక్టర్ చదివి సమాజంలో మంచి సేవ కార్యక్రమాలు చేయాలని తల్లిదండ్రుల కోరిక నెరవేర్చాలని కోరారు.

కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబరాలు

- బతుకమ్మ ఆడిన కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ కలెక్టరేట్ ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో శనివారం రాత్రి బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ వేడుకలకు కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ శ్యామలదేవి హజరయ్యారు. ముందుగా గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, హారతులిచ్చి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టరేట్‌లో పని చేసి మహిళ ఉద్యోగుల, వివిధ శాఖల ఉద్యోగులు బతుకమ్మలను తీరొక్క పూలతో పేర్చి తీర్చిదిద్దారు. అనంతరం బతుకమ్మ పాటలకు కలెక్టర్, ఉద్యోగులు బతుకమ్మ ఆడుతూ అలరించారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయానికి బతుకమ్మ పండుగ ప్రతీక అని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఓ సాయన్న, ఆయా శాఖల ఉద్యోగులు, మహిళలు ఉన్నారు.

తహసీల్దార్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

అక్రమ మొరం తరలింపుపై తహసీల్దార్ అనుసరిస్తున్న తీరును వ్యతిరేకిస్తూ ఖానాపూర్ మున్సిపల్ చైర్మెన్ చిన్నం సత్యం శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కమురంభీం చౌరస్తా సమీపంలోని 110 ఎకరాల ప్రభుత్వ స్థలం నుంచి అక్రమార్కులు మొరం తరలించుకుపోతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ తతంగం తహసీల్దార్‌కు తెలిసే జరుగుతుందని పట్టణంలో ప్రచారం అవుతున్నా ఆయన ఏమి తెలువనట్టుగా ఉంటున్నారని పేర్కొన్నారు. ఏదైనా ఉంటే మైనింగ్‌శాఖకు చెప్పుకోండి అంటూ నిర్లక్ష్యపు సమాదానం చెబుతున్న తహసీల్దార్ పై చర్యలు తీసుకొని, సదరు భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆరో విడత ద్వారా ఐటీఐలో అడ్మిషన్లు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆరో విడత ద్వారా ఐటీఐ కళాశాలలో ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు ఆదిలాబాద్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రొడ్డ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్టోబర్ 5 నుంచి అక్టోబర్ 9 వరకు అవకాశం కల్పించినట్టు పేర్కొన్నారు. ఇప్పటికే నమోదు చేసుకున్న అభ్యర్థులు, తిరిగి నమోదు చేయనవసరం లేదని తెలిపారు. ఇంకా నమోదు చేయని అభ్యర్థులు ఐటీఐ పోర్టల్‌లో కొత్తగా నమోదు చేసుకుని, కళాశాలకు హాజరు కావాలని సూచించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నార్నూర్

ఈనెల 7, 8వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే 35వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని, పీఆర్టీయూ గాదిగూడ మండలాధ్యక్షులు మెస్రం లింగు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర సమావేశానికి జిల్లా, మండలం, కార్యవర్గ సభ్యులు, ప్రాథమిక సభ్యులు, సంఘం అభిమానులు అధికసంఖ్యలో సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలనీ కోరారు.

సభ్యత్వ నమోదును ముమ్మరం చేయాలి

నవతెలంగాణ-ముధోల్

గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలని, బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లా కోఆర్డినేటర్ సుష్మారెడ్డి అన్నారు. ముధోల్ మండలంలోని ఎడ్‌బిడ్, వెంకటాపూర్, చించాల, తరోడా గ్రామాల్లో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రతీ గ్రామం నుంచి ఎంతో మంది బీజేపీని ఆదరించారని వారందరికీ సభ్యత్వం ఇచ్చేలా చూడాలని కార్యకర్తలకు సూచించారు. నియోజకవర్గ పరిధిలో లక్ష ఇరవై వేల వరకు సభ్యత్వం నమోదు చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేస్తున్నారని తెలిపారు. బూత్ స్థాయి నుంచి ముందుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ముధోల్ తాలుకా కోఆర్డినేటర్ సాంప్లీ రమేష్, మండల సభ్యత్వ నమోదు కోఆర్డినేటర్ సతీష్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షులు కోరి పోతన్న, నాయకులు నిమ్మ పోతన్న, దత్తాత్రి, పిట్లం శివురాం, సాయినాథ్, శ్రీనివాస్, ఉదయ్, దిగంబర్ పటేల్, ఋషి, రవి, రాము, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్

యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. ఆదివారం సీఎం కప్ ర్యాలీ జిల్లా కేంద్రానికి చేరుకున్న సందర్భంగా స్థానిక మంచిర్యాల చౌరస్తాలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి కలెక్టర్ ర్యాలీకి ఘన స్వాగతం పలికారు. అనంతరం క్రీడా జ్యోతి వెలిగించి ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ మంచిర్యాల చౌరస్తా నుండి ఎన్టిఆర్ మినీ స్టేడియం వరకు కొనసాగింది. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులకు క్రీడలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఎంతో తోడ్పడుతుందన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి కప్ 2024 టార్చ్ ర్యాలీ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిర్మల్ పట్టణానికి వచ్చిన టీమ్ సభ్యులు రాష్ట్రంలోని 33 జిల్లాలలో పర్యటిస్తారని అందులో నిర్మల్ నాలుగో జిల్లా కావడం విశేషమని అన్నారు. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాభివృద్ధికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. జిల్లా కేంద్రాలలో క్రీడా మైదానాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జి.ఈశ్వర్, డివైఎస్ఓ బి. శ్రీకాంత్‌రెడ్డి, పెటా ప్రెసిడెంట్ భూక్య రమేష్, ఒలంపిక్ సంఘ ప్రతినిధులు శ్రీధర్ రెడ్డి, క్రీడా సంఘాల ప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, అధికారులు, యువత పాల్గొన్నారు.



ట్రిపుల్ ఐటీలో జరిగిన

అవినీతిపై స్పందించరెందుకు...?



- ట్రిపుల్ ఐటీ ఉద్యోగులను ప్రశ్నిస్తున్న స్థానికులు, విద్యార్థి సంఘాలు

నవతెలంగాణ-ముధోల్

బాసర ట్రిపుల్ ఐటీలో గత వారం రోజులుగా చోటు చేసుకుంటున్న పరిణామాలపై ట్రిపుల్ ఐటీ ఉద్యోగులు వీసీ వెంకటరమణ, చీఫ్ వార్డెన్ శ్రీధర్‌పై వచ్చిన ఆరోపణలపై మాత్రమే స్పందించడంపై బిన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. వీసి వెంకటరమణపై తీవ్రమైన ఆరోపణలు చేస్తూ, ఓయూ జేఏసీ పేరిట కరపత్రాన్ని సామాజిక మద్యమాల్లో చక్కర్లు కొడుతోంది. అలాగే రెండు రోజుల కింద ఓయూ జేఏసీ నాయకులు అధికారికంగా హైదరాబాద్‌లో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వీసీ ఆగడాలపై కరపత్రాన్ని విడుదల చేశారు. వీసీ మహిళా ఉద్యోగులను వేధిస్తున్నారని ఆరోపించారు. అవినీతి, అక్రమాలకు వీసీ పాల్పడ్డారని, దీంతో పాటు లైంగిక వేధింపుల ఆరోపణలు ఉన్నాయి. మహిళా ఉద్యోగులు ఉమెన్ వింగ్ పేరిట ఖండిస్తూ ప్రకటన విడుదల చేశారు. అయితే దీని ఉద్యోగులు స్పందించడం లేదు. ఉద్యోగుల తీరును స్థానికులు, విద్యార్థి సంఘాలు, విద్యావంతులు, తప్పుపడుతున్నారు. కేవలం వీసీ మంచోడు అంటే సరిపోదని, అవినీతి, అక్రమాలపై నిజనిజాలు మాట్లాడాలని పలువురు సూచిస్తున్నారు. అలాగే గత రెండు రోజుల కింద రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ తనిఖీ చేసింది. అయితే చీఫ్ వార్డెన్ శ్రీధర్‌పై నిరాదరమైన ఆరోపణలు మోపారని, ట్రిపుల్ ఐటీ ఉద్యోగులు ఖండించారు. అయితే ప్రజల సొమ్మును వీసీ ప్రక్కదారి పట్టిస్తున్నాడని ఒకపక్క విద్యార్థి సంఘాలు, పలు పార్టీల నాయకులు ఆరోపిస్తున్నప్పటికి స్పందించకపోవడంపై విమర్శల వ్యక్తం అవుతున్నాయి. ట్రిపుల్ ఐటీ విద్యార్థుల కోసం ఖర్చు చేసే సొమ్ము దారి మల్లుతున్నప్పుడు ఉద్యోగులైన, ప్రజలైన, విద్యార్థి సంఘాల అయినా ప్రతి ఒక్కరూ ప్రశ్నించాల్సి ఉంటుంది. మాకెందుకులే అని వదిలేయడం కూడా సరికాదని పలువురు అంటున్నారు. ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకుంటూ విధులు నిర్వహిస్తున్న వారు కూడా ప్రజల సొమ్ము దారి మల్లుతున్నప్పుడు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతుంన్నాయి. ట్రిపుల్ ఐటీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై మొదట్లోనే ప్రశ్నించేవారు. లేకపోవడంతో కోట్లాది నిధులు దారి మల్లుతున్నట్టు విద్యార్థి సంఘాలు గగ్గోలు పెడుతున్న పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. దీంతో ఓ బాస్ ఉచ్చులో చిక్కుకోని మిన్నకుండి పోతున్నారన్న అపవాదును మూట కట్టుకుంటున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ట్రిపుల్ ఐటీలో జరిగిన అవినీతి, అక్రమాలపై ఇకనైనా మేలుకొని ప్రజల సొమ్మును దారి మల్లకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

వరి పైరుకు ఎలుకల బెడద

- పనిచేయని నియంత్రణ చర్యలు



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఈసారి వరి పైరుకు ఎలుకల బెడద తీవ్రంగా ఉంది. పైరు ఏపుగా పెరిగిన నుంచి పైరును ఆశిస్తూ పంటను నాశనం చేస్తున్నాయి. గతంలో ఈస్థాయిలో ఎలుకలు పంటను పాడుచేయలేదని, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలుకల బెడద తీవ్రంగా ఉన్న పొలంలో ఎకరానికి 10 క్వింటాళ్లకు మించి ధాన్యం దిగుబడి వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. ఎలుకల నివారణకు ఎన్ని రకాల చర్యలు చేపట్టినా అదుపు కావడం లేదని చెబుతున్నారు. గతంలో ఎదో ఓ చోట ఎలుకల ప్రభావం ఉండేది. ఈ సారి వాటి తీవ్రత అధికంగా ఉండటంతో దిగుబడులపై రైతుల్లో ఆందోళన నెలకొంది. ప్రభుత్వం సన్నరకాలకు రూ.500 బోనస్ ప్రకటించడంతో ఈ సారి ఎక్కుశాతం రైతులు వాటి వైపే మొగ్గు చూపారు. ఆర్ఎస్ఆర్, జేజీఎల్, బతుకమ్మ, కావేరి చింటూ, రైతుమిత్ర, జైశ్రీరాం, సాయిరాం తదితర సన్నరకాల వరి వంగడాలను వేసుకున్నారు. ఈ రకాలకు ఎలుకల బెడద తీవ్రంగా ఉంది. ప్రధానంగా మస్కాపూర్, ఖానాపూర్, దిలావర్‌పూర్ పొలిమేరలోని నల్లరేగడి పొలాల్లో ఎలుకల బెడద తీవ్రంగా ఉండటంతో రైతులు ఏమి చేయలేని నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు

సల్ల శ్రీనివాస్, రైతు, ఖానాపూర్



నేను నాలుగున్నర ఎకరాల్లో సన్న వరి రకాలను వేశాను. ఎకరానికి ఇప్పటి వరకు రూ.22 వేలు ఖర్చు అయ్యింది. కౌలు, పెట్టుబడి పోను అసలుకే నష్టం వచ్చేలా ఉంది. ఎలుకల తీవ్రత ఇంతగా ఉంటుందని అనుకోలేదు. అర ఎకరంలో వేసిన దొడ్డురకం వరి బాగానే ఉంది.

సంఘాల అభివృద్ధికి కృషి చేస్తాం : ఎంపీ



- గ్రంథాలయ పనుల నిర్మాణానికి శంకుస్థాపన
- పాల్గొన్న ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ నియోజకవర్గంలోని ఆయా సంఘాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ గోడం నగేష్ అన్నారు. ఆదివారం మూన్నురు కాపు సంఘ భవనంలో ఎంపీ నిధులు రూ.9లక్షల 50వేలతో నిర్మించే గ్రంధాలయ పనులకు ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి శంఖుస్థాపన చేశారు. ముందుగా అక్కడే ప్రతిష్ఠించిన దుర్గాదేవి వద్ద పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ బీసీ సంఘాలకు పెద్ద అన్న పాత్ర పోశించే మున్నురుకాపు సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. తాలుకా పెద్ద సముహం మున్నూరుకాపు అని సామాజిక అంశాల్లో తమ సముహమే కాకుండా మిగిత వారికి కూడా అండగా ఉంటుందన్నారు. మౌళిక వసతులు కావాలని కోరడంతో గ్రంథాలయం కోసం నిధులు కేటాయించడం జరిగిందన్నారు. దీంతో ఇతర సంఘాలకు కూడా తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లాలామున్న, ఆకుల ప్రవీణ్, మున్నూరు కాపు సంఘం ప్రధాన కార్యదర్శులు కలాల శ్రీనివాస్, కోశాధికారి జైపాల్, ఉపాధ్యక్షులు కోరెడ్డి శంకర్, గంట సురేష్, సంతోష్, శ్రీనివాస్, రఘుపతి, దారట్ల జీవన్, ప్రభావతి, జోగు రమణి, గంట స్వప్న, బండారి సుధ, సంధ్య, బీసీ అధ్యక్షురాలు పసుల రమ పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం చేస్తున్న మోడీ ప్రభుత్వం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. పత్తికి గిట్టుబాటు ధర లేదన్నారు. పత్తికి పదివేల ధర ఇవ్వాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటాల రాములు, జిల్లా కౌన్సిల్ సభ్యులు షేక్ పాషా, అర్ధాంగి రమేష్, బీకేఎస్‌యూ జిల్లా అధ్యక్షులు ఖండాల గణేష్, సీపీఐ సీనియర్ నాయకులు బెజ్జంకి నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

చేనేత హస్తకళ ప్రదర్శనను సందర్శించాలి

నవతెలంగాణ-నిర్మల్

చేనేత హస్తకళ ప్రదర్శనను ప్రతి ఒక్కరూ సందర్శించాలని మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. ఆదివారం స్థానిక ఎంఎస్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళ ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో ప్రతీ ఒక్కరూ రెడీమేడ్ ఫ్యాషన్‌లో పడటంతో చేనేత కార్మికులకు ఆదరణ తక్కువయ్యిందన్నారు. వారికి సహకరించి, తోడుగా నిలువాలని కోరారు. కార్యక్రమంలో ఎగ్జిబిషన్ నిర్వాహకులు పవన్‌కుమార్ మోదీ, రాహూల్ కుమార్, కృష్ణ, రాధే, జావిద్, కోఅష్షన్ సల్మాన్, జాఫర్ పాల్గొన్నారు.

వీసీకి మద్దతునివ్వడం మానుకోవాలి

నవతెలంగాణ-ముధోల్

అవినీతి ఆరోపణలున్న వీసీకి కొంత మంది ఉద్యోగులు మద్దతు నివ్వడం మానుకోవాలని ఓయూ జేఏసీ అధ్యక్షుడు సర్ధార్ వినోద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ట్రిపుల్ ఐటీలో ఇప్పటివరకు ఎంతోమంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నా ట్రిపుల్ ఐటీ ఉద్యోగులు స్పందించకపోవటం మరిచిపోయారని, వీసీపై ఆరోపణలు రావడంతో కావాలని స్పందించడం సరికాదని తెలిపారు. ప్రభుత్వం వీసీ వెంకటరమణ మీద విచారణ జరిపేంత వరకు మా పోరాటం ఆగదని తెలియజేశారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు



నవతెలంగాణ-ఉట్నూర్

విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఇటీవల ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన వెడ్మ మనిషాను శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టపడే తత్వం పట్టుదల కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో లక్ష్యం గొప్పదై ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్‌లకు బానిస కావద్దని, నిత్యం పుస్తకాలను చదువుతు ఉండాలని సూచించారు. సమాజంలో అట్టడుగు స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన వారిని స్ఫూర్తిగా తీసుకొని అనుకున్న లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకు వెళ్లాలన్నారు. మనీషా వైద్య రంగంలో ఉన్నత చదువుల చదువుకొని ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా కృషి చేయాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో వెడ్మ శ్యాంరావ్ టీచర్, కుటుంబ సభ్యులు ఉన్నారు.

ఐక్యంగా ఉండి ప్రభుత్వాన్ని నిలదీయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దుకాణాల్లో పని చేసే కార్మికుల సంక్షేమం కోసం ఐక్యంగా ఉండి ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అవసరముందని విశ్రాంత కార్మికశాఖ అధికారి చిట్యాల జగదీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని నేతాజీచౌక్‌లో దుకాణాల్లో పని చేసే కార్మికులకు కార్మిక సంక్షేమ చట్టాల గురించి అవగాహన కల్పించారు. చట్టాలు, పథకాలు తెలియక నేడు కార్మికులు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత కార్మికశాఖ అధికారి జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ 37 ఏండ్లు కార్మిక శాఖలో పని చేసిన తనకు వారి సమస్యల గురించి అవగాహన ఉందన్నారు. కార్మికులు ప్రశ్నించనిదే పథకాలు రావన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి 9 నెలలవుతున్న ఇప్పటి వరకు కార్మికశాఖ మంత్రి లేడన్నారు. ఎలా కార్మిక సమస్యలు పరిష్కరం అవుతాయని ప్రశ్నించారు. కార్మికులు ఐక్యంగా ఉండి ఓటు అనే ఆయుధంతో ప్రభుత్వాన్ని ఎప్పుడైతే బయపేడుతారో అప్పుడు పథకాలు సక్రమంగా వస్తాయన్నారు.

వైభవంగా గంగనీళ్ల జాతర

- ఉదయం నుంచి భక్తుల తాకిడి



నవతెలంగాణ-సారంగపూర్

మండలంలోని ఆడెల్లి మహాపోచమ్మ జాతర రెండు రోజుల పాటు జరిగిన గంగ పోచమ్మ జాతర ఆదివారం సాయంత్రం ముగిసింది. శనివారం మధ్యాహ్నం పోచమ్మ నగలను అడెల్లి దేవాలయం నుంచి వేలాది మంది భక్తులు కలినడకతో 30 కిలో మీటర్ల పాటు అడెల్లి, సారంగాపూర్, యకరపల్లి, ప్యారమూర్, మడగాం, దిలావర్‌పూర్, బన్సపల్లి, కంజర్, మల్లాపూర్, మీదుగా సాంగ్వి గ్రామానికి చెరుకొని శనివారం అక్కడే బస చేసి, ఆదివారం ఉదయం గోదావరి నది జలాలతో నగలను శుద్ధి చేసి తిరిగి అదే దారి గుండా భక్తులు నగలను తీసుకొని దేవాలయానికి చేరుకొన్నారు. గ్రామ గ్రామాన భాజాభజంత్రీల నడుమ మంగళ హారతులతో స్వాగతం పలికి అమ్మవారి నగల మూటను దర్శించి మొక్కులను తీర్చుకున్నారు. సాయంత్రానికి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ శర్మ భక్తులు తెచ్చిన గంగ జలాలతో దేవిని అభిషేకం చేసి నూతన వస్త్రాలు కట్టి అమ్మవారిని నగలతో అలంకరించి మంగళ హారతులిచ్చారు. వచ్చిన భక్తులకు దేవి దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు అందిచారు. దీంతో జాతర ముగిసింది. ఆదివారం వేకువ జాము నుంచి ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాలతో పాటు మహారాష్ట్రలోని నాందేడ్, చంద్రపూర్, నాగపూర్ జిల్లా నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అమ్మవారికి పెరుగన్నం నైవేద్యంగా సమర్పించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు కాలినడకన ప్రయివేట్ వాహనాలలో అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

భారీ బందోబస్తు ఏర్పాటు...

శనివారం ఉదయం, ఆదివారం సాయంత్రం వరకు జాతరకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈఓ రమేష్ అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ జానకి షర్మిల ఆదేశానుసారం డీఎస్పీ గంగారెడ్డి అధ్వర్యంలో సీఐ రామకృష్ణ, స్థానిక ఎస్సై శ్రీకాంత్ బందోబస్తు నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డా.వేదవ్యాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అవసరమైన భక్తులకు ప్రాథమిక వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు.



బాధిత ఆదివాసీ మహిళకు అండగా ఉంటాం

- రాష్ట్ర మంత్రి సీతక్క



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జైనూర్ బాధితురాలికి అండగా ఉంటామని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పూర్తి చేసుకుని వెళ్తున్న క్రమంలో ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ నాయకురాలు సుగుణక్క, ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌తో కలిసి వెళ్లి పరామర్శించి ఆమెకు రూ.20,000 ఆర్థిక సాయంతో పాటు బట్టలు అందజేసి ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ అయిన తర్వాత ప్రత్యేక వాహనంలో పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జైనూర్ సంఘటనలో ఆదివాసీ బాధితురాలికి అండగా ఉంటామని తెలిపారు. ఆదివాసీ ప్రాంతం సాధారణ పరిస్థితిలో నెలకొనేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-కౌటాల



పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని సాండ్గాం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై ఎస్ మధుకర్ తెలిపిన వివరాల ప్రకారం ఖోబ్రగడే మనోహర్(28)కు ఏడు సంవత్సరాల క్రితం వివాహం అయింది. భార్యకు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాదపడుతుంది. భార్యకు ట్రీట్మెంట్ చేయించేందుకు డబ్బులు లేక మనస్థాపానికి గురై తాగుడికి బానిసయ్యాడు. తాగిన మైకంలోనే ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగులమందు తాగాడు. చుట్టుప్రక్కల వారు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించడంతో చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్‌కు తరలించారు. ఆస్పత్రికి చేరేలోగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి దత్తు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మరమ్మత్తు పనులు



నవతెలంగాణ-సిర్పూర్(టి)

జిల్లాలోని సిర్పూర్-టి మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ ఆదేశాల మేరకు మరమ్మత్తు పనులు చేశామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రవీందర్ తెలిపారు. గత నెల 30న హాస్టల్ నిద్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఆశ్రమ బాలుగా ఉన్నత పాఠశాలలో రాత్రి బస చేశారని, ఆ సమయంలో పాఠశాల వసతి గృహ పరిసరాలు, గదులు, సౌకర్యాలను పరిశీలించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. ప్రస్తుతం దసరా సెలవుల నేపథ్యంలో పనులను వేగవంతం చేసి పాఠశాల పున్ణప్రారంభించే సమయానికి పూర్తి సౌకర్యాలతో సిద్ధం చేయాలని, విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించే విధంగా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించినట్లు తెలిపారు. అందులో భాగంగానే మనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు.

బెయిల్‌పై విడుదలైన వారికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జైనూర్ ఘటనలో అరెస్ట్ అయి విడుదలైన 30 మందికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వ్యక్తిగత నిధుల నుండి కుటుంబ సంరక్షణ కోసం రూ. పదివేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. సహాయానికి చెందిన చెక్కులను బీజేపీ రాష్ట్ర నాయకుడు సతీష్ బాబు, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎలగతి సుచిత్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొత్తం 30 మంది ఘటనలో జైలుకు వెళ్లారని వీరిలో 27 మంది కరీంనగర్ జైలు నుండి విడుదల కాగా వారికి మంత్రి నేరుగా అందజేశారన్నారు. మిగతా ముగ్గురు జిల్లా సబ్ జైలు నుండి విడుదల వారికి అందజేసినట్లు తెలిపారు. జైనూర్ ఘటనలో అనేకమంది అమాయకులను పోలీసులు అరెస్టు చేయడం సరైన విధానం కాదన్నారు. ఇప్పటికైనా ఘటన సద్దుమణిగే దిశగా చర్యలు తీసుకోవాలని, ఆదివాసులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ శ్రావణ్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇగురపు సంజీవ్, జైనూరు మండల అధ్యక్షుడు ఆత్రం అర్జున్, ఆదివాసీ నాయకులు పటేళ్లు, సర్పంచ్లు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఎదుట ధర్నాను విజయవంతం చేయండి



నవతెలంగాణ-బెజ్జూర్

ఆదివాసుల సమస్యల పరిష్కరంతో పాటు చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసీ కొలవార్ మన్నేవార్ సేవ సంఘం మండల యుజన సంఘం అధ్యక్షుడు మెడి సతీష్ డిమాండ్ చేశారు. సమస్యల సాధన, జైనూర్ ఘటన బాధితురాలిని ఆదుకోవాలనే డిమాండ్‌తో సోమవారం ఐటీడీఏ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1950 తర్వాత వలస వచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివాసీ చట్టాలు, 1/70 చట్టాన్ని పక్కడబందిగా అమలు చేయాలన్నారు. ఏజెన్సీ భూ సమస్య అధికారాలు అప్పగించిన హైకోర్టు తీర్మాణానికి నిరసనగా ఐటీడీఏ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కొలవార్ జిల్లా సహాయ కార్యదర్శి పోల్క వెంకటేష్, మాడవి పుల్లయ్య, గ్రామ యువజన ప్రధాన కార్యదర్శి మానేపెల్లి వెంకటేష్, ఉపాధ్యక్షులు నాయిని మారుతి, సంస్కృతిక ఉపాధ్యక్షులు మేకల గొంతు, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

లారీ అసోసియేషన్ ఆందోళనకు బీఆర్ఎస్ మద్దతు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు పేపర్ మిల్లు వైఖరిని నిరసిస్తూ స్థానిక లారీ ఓనర్స్ అసోసియేషన్ చేపడుతున్న ఆందోళనకు ఆదివారం బీఆర్ఎస్ మద్దతు తెలిపింది. ఈ మేరకు అసోసియేషన్ కార్యాలయానికి వెళ్లి బీఆర్ఎస్ నాయకులు వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిత్యం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కిరాయి పెంచాల్సిన మిల్లు యాజమాన్యం కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. లారీ అసోసియేషన్ డిమాండ్లను వెంటనే మిల్లు యాజమాన్యం ఆమోదించాలని, లేనిపక్షంలో లారీ అసోసియేషన్ చేపట్టే ఆందోళన కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతునిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురె శ్యాంరావు, నాయకులు మోయిన్, నక్క మనోహర్, భట్టుపల్లి అంజన్న, శోభన్ పాల్గొన్నారు.

అడ్డుపెట్టినా.. ఆగరేమీ..?

- ప్రవేశ రహదారి వద్ద పరేషాన్
- గుండి రోడ్డు అధ్వానమే కారణం
- వాహనదారుల్లో పెరగని అవగాహన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రస్తుతం సమాజంలో మనుషులకు పెరుగుతున్న అవసరాలు త్వరగా పని పూర్తి కావాలనే ఆలోచన కొన్ని సందర్భాల్లో పెద్ద ప్రమాదాలను తీసుకువస్తుంది. ప్రస్తుతం జాతీయ రహదారి నుండి జిల్లా కేంద్రంలోకి ప్రవేశించే ప్రవేశ రహదారి వద్ద ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని వేచి చూడడం తప్ప చేసేదేమీ లేకుండా పోతోంది. రహదారిపై పోలీసులు డివైడర్లు అమర్చిన వాహనదారులు అవగాహన లోపంతో ప్రమాదాలు జరిగే అవకాశాలకు తెరలేస్తుంది.

అడ్డుపెట్టిన ఆగరా..?

జాతీయ రహదారి నుండి జిల్లా కేంద్రంలోకి మంచిర్యాల వైపు నుండి ప్రవేశించే ద్వారం వద్ద పోలీసుల సూచనతో హైవే అధికారులు సిమెంటు గద్దర్లు రోడ్డును విభజిస్తూ ఏర్పాటు చేశారు. అయిన ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు రాంగ్ రూట్‌లో వెళ్తున్నారు. ఆదర్శ పాఠశాల ఎదురుగా రోడ్డు దాటుతున్నారు. పోలీసులు అడ్డుపెట్టిన వాహనదారులు ఆగేలా కనిపించడం లేదు.

ప్రవేశ రహదారి వద్ద పరేషాన్

జిల్లా కేంద్రంలోకి ప్రవేశించడం, జిల్లా కేంద్రంలో నుండి మంచిర్యాల వైపు వెళ్లేవారు హైవే పైకి వెళ్లడానికి జిల్లా కేంద్రం చివర రోడ్డును విభజిస్తూ డివైడర్లు ఏర్పాటు చేశారు. మంచిర్యాల వైపు వెళ్లేవారు ఎడమవైపుకు తీసుకొని గుండి గ్రామానికి వెళ్లే అండర్ పాస్ వద్ద యూటర్న్ తీసుకుని నేషనల్ హైవేకు కలవాల్సి ఉంటుంది. కానీ ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులు ఈ నిబంధనలు పాటించడం లేదు.

గుండి రోడ్డు అధ్వాన్నమే కారణం

హైవే రహదారి పూర్తయిన తర్వాత గత జనవరి నెల వరకు జిల్లా కేంద్రం చివరన హైవే రహదారికి కలిసే విధంగా రహదారిపై కటింగ్ ఏర్పాటు చేశారు. అయితే జనవరి 21న ఒక కంటైనర్ ఢీకొని తల్లి కొడుకు మృతి చెందటం, భారీ ప్రమాదాలు జరుగుతుండడంతో అక్కడ మూసివేసి జిల్లా కేంద్రం నుండి వెళ్లే వాహనాలు గుండి రహదారి నుండి హైవే పైకి వెళ్లడానికి నిర్ణయించారు. ప్రధాన రహదారి నుండి గుండి గ్రామ అండర్‌పాస్ వరకు రహదారి అధ్వానంగా ఉండడంతో వాహనదారులు దానిపై నుండి వెళ్లడానికి ఇష్టపడడం లేదు. దీనితో నేరుగా వెళ్తూ రాంగ్ రూట్‌లో వెళ్తున్నారు. గుండి రహదారి పూర్తయితే రాంగ్ రూట్‌లో వెళ్లే వారి సంఖ్య తగ్గుతుంది. అధికారులు ఆదేశాల చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వాహనదారుల్లో పెరగని అవగాహన

పట్టణాల్లో యూటర్న్ తీసుకోవడానికి కిలోమీటర్ల దూరం వాహనదారులు వెళ్తుంటారు. కానీ జిల్లా కేంద్రంలో అనేక మందికి అవగాహన లేక పోవడం తొందరగా హైవే పైకి వెళ్లాలని ఆత్రుతతో రాంగ్ రూట్‌లో వెళ్తున్నారు. పోలీసులు పలుమార్లు అక్కడే ప్రత్యేక చెక్ పాయింట్ ఏర్పాటు చేసిన వాహనదారుల్లో మార్పులు రావడం లేదు.

ప్రత్యేక చెక్ పాయింట్ ఏర్పాటు చేస్తాము

సతీష్, సీఐ

జిల్లా కేంద్రం నుండి హైవే పైకి వెళ్లే వాహనాలు తప్పనిసరిగా గుండి అండర్ పాస్ కింది నుండి వెళ్లాలి. రాంగ్ రూట్‌లో వెళ్తున్న వాహనాలను గుర్తించడానికి ప్రస్తుత అటవీ శాఖ చెక్ పోస్ట్ ప్రత్యేక చెక్ పాయింట్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాం.



రాంగ్‌రూట్‌లో వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు



రాంగ్‌రూట్‌లో వెళ్తున్న ట్రాక్టర్

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



నవతెలంగాణ-చింతలమానేపల్లి

బీజేపీ సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు 2024 ప్రాథమిక సభ్యత్వ నమోదు చివరి అంకంలో భాగంగా వచ్చే పది రోజులు కార్యకర్తలందరూ పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. ప్రజాస్వామ్య దేశాల్లో భారత దేశంలో బీజేపీ అధిక సభ్యత్వం కలిగిన పార్టీ అని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి మనోహర్ గౌడ్, మాజీ జడ్పీటీసీ ఎల్ములే మల్లయ్య మండల అధ్యక్షులు తిరుపతి గౌడ్, మాజీ సర్పంచ్ చౌదరి నానయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : సభ్యత్వ నమోదు త్వరగా పూర్తిచేయాలని, క్రియాశీలక మెంబర్ షిప్‌లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు జూనియర్ మధుకర్ అధ్యక్షతన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్క బూత్ స్థాయి నాయకులు కార్యకర్తలు బాధ్యతగా తీసుకొని ప్రతి బూతులో సభ్యత్వాన్ని చేయించాలన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. మండల స్పెషల్ డ్రైవ్ బూత్ ఇన్‌చార్జులుగా పాలే సంతోష్, సాయిరె కిరణ్‌లను నియమించారు. కార్యక్రమంలో తాలూకా కన్వీనర్ వీరభద్ర చారి, జిల్లా కార్యవర్గ సభ్యులు గణపురం నాగేష్, ఓబీసీ మోర్చ అధ్యక్షుడు భుజంగరావు, మాజీ ఎంపీటీసీ దుగుంట రాజన్న, భీమయ్య కాంతారావు, ప్రభాకర్ పరిదేశి, హరీశ్, శంశీర్, హైమద్, బాపూజీ, రాకేష్, అన్నం గణపతి, బోయిరే నానయ్య, బండి ప్రభాకర్ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌తో నేడు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ అనుబంధ గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెరిక శ్రీకాంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నెలనెల వేతనాలు రాక, పనికి గుర్తింపు లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని వీటన్నిటి పరిష్కారం కోసం నేడు ధర్నా నిర్వహించడానికి నిర్ణయించినట్లు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

కాటేపల్లిలో పోచమ్మ బోనాలు

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని కాటేపల్లి గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాలు వేశారు. వర్షాల కురివలని పంటలు సమృద్ధిగా పండాలని, వ్యాధులు రాకుండా కాపాడాలని గ్రామస్తులు బోనాలు సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. గ్రామంలో శోభాయాత్ర నిర్వహించి పోచమ్మ వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

రహదారిపై పశువులు

- రాకపోకలకు ఇబ్బందులు

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని రహదారిపై పశువులు తిరగడంతో అటు మహారాష్ట్ర నుండి ఇటు తెలంగాణ నుండి వెళ్లే వాహనదారులకు ఇబ్బందిగా మారింది. అతివేగంగా వచ్చే వాహనాలు వీటిని చూసి నెమ్మదిగా వెళ్లాల్సి వస్తుంది. ఒక్కసారి గమనించకపోతే వేగంగా వచ్చే లారీలు, కార్లుకు ప్రమాదాలు జరిగే అవకాశాలు లేకపోలేదు. పశువుల యజమానులు పట్టించుకోనట్లుగా వ్యవహరిస్తున్నారు. రోడ్లపై పశువులు సంచరిస్తున్న కారణంగా పలుమార్లు ద్విచక్ర వాహనదారులు గాయాల పాలైన సంఘటనలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. పశువులు రహదారిపై సంచరించకుండా యజమానులపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డుపై సంచరిస్తున్న పశువులు

పనులు లేక... వేతనాలు రాక

- దుర్భర జీవితం గడుపుతున్న సీఎఫ్‌సీ కార్మికులు
- మూడు నెలలుగా పనులు లేక ఖాళీగా ఉంటున్న వైనం
- రెండు నెలల జీతాలు కూడా పెండింగ్‌లోనే
- అధికారులు స్పందించి ఆదుకోవాలని వేడుకోలు



పనులు లేక నిరుపయోగంగా ఉన్న పరికరాలు



పనులు లేక వెలవెలబోతున్న సీఎఫ్‌సీ కేంద్రం

నవతెలంగాణ-వాంకిడి

దశాబ్దాల నుండి కామన్ ఫెసిలిటీ సెంటర్(సీఎఫ్‌సీ)నే నమ్ముకుని కఠినమైన పరిస్థితుల్లో కూడా పరిశ్రమను కాపాడుకుంటూ వస్తున్న కార్మికులను ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నాయి. వందలాది కార్మికులతో కళకళలాడిన సీఎఫ్‌సీ ప్రస్తుతం కేవలం ప్రభుత్వ ఆర్డర్లపైనే ఆధారపడుతుంది. కానీ కొన్నేండ్లుగా సరైన ఆర్డర్లు లేక కార్మికులకు చేతినిండా పని లేకుండా పోతోంది. అక్కడ పని చేస్తున్న కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల ఓ కార్పొరేట్ సంస్థ నుండి పాఠశాలలకు డ్యూయెల్ డెస్కుల ఆర్డర్ రాగా మూడు నెలల క్రితమే పనులు పూర్తిచేశారు. వాటికి సంబంధించిన పూర్తి బిల్లులు రాలేదు. రెండు నెలలకు సంబంధించిన కార్మికుల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే మూడు నెలలుగా ఇతర ఆర్డర్లు లేక కార్మికులంతా ఖాళీగా ఉన్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి వేతనాలతో పాటు ప్రభుత్వ ఆర్డర్లు ఇప్పించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

30 ఏండ్లుగా పరిశ్రమను నమ్ముకొని...

1970లో వృత్తి శిక్షణ కేంద్రంగా వాంకిడిలో ఏర్పాటైన సీఎఫ్‌సీ పరిశ్రమ 7980లో ఐటీడీఏ ఆధీనంలోకి వచ్చింది. అప్పటి నుండి కలపతో అనేక రకాల పనులు చేస్తున్నారు. మారుతున్న కాలంతో పాటు కలప కొరతతో ఇనుముతో సామాగ్రి తయారీపై దృష్టి సారించారు. కలపతో పాటు వెల్డింగ్ సెక్షన్‌ను కొన్నేండ్ల పాటు కొనసాగించారు. అప్పటి ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా 10 సీఎఫ్‌సీలను ఏర్పాటు చేసింది. వాటిలో వాంకిడిలో ఏర్పాటు చేసిన సీఎఫ్‌సీ పరిశ్రమ మాత్రమే ప్రస్తుతం మనుగడలో ఉంది. కఠిన పరిస్థితుల్లోనూ మూతపడకుండా నిలదొక్కుకోవడంలో అధికారుల సహకారంతో పాటు కార్మికుల ఐక్యత ప్రధాన కారణంగా నిలుస్తోంది. నాణ్యతతో కూడిన పనితీరుతో అధికారుల నుండి ప్రశంసలు, ప్రభుత్వ ఆర్డర్లు పొందుతూ పరిశ్రమను కాపాడుకుంటున్నారు. 30 ఏండ్లుగా ఈ పరిశ్రమను నమ్ముకొని కార్మికులు పనిచేస్తున్నారు. కరోనా సమయంలో ఆర్డర్లు లేక ఆర్థిక సంక్షోభంలోనూ పరిశ్రమ ఇన్‌చార్జి మడావి పైకాజీ, కార్మికులు, కలెక్టర్, ఐటీడీఏ పీఓ కార్యాలయాల చుట్టూ తిరిగి ఆర్డర్లు వచ్చేందుకు కష్టపడ్డారు. అయితే ఒక ఆర్డర్ పనులు పూర్తయ్యాక మరో ఆర్డర్ అందడంలో ఆలస్యమవుతుంది. కార్మికులు కొన్ని నెలల పాటు ఉపాధి కోసం ఎదురుచూడాల్సి వస్తుంది. పనులు లేని సమయాల్లో వారి జీవితాలు దుర్భరంగా మారుతున్నాయి.

రెండు నెలలుగా...

సీఎఫ్‌సీ పరిశ్రమపై ఆధారపడిన కార్మికులకు ఉన్నతాధికారులు అండగా నిలుస్తున్నారు. పనులు కరువైన సమయాల్లో కార్పొరేట్ సంస్థల సహకారంతో ప్రభుత్వ ఆర్డర్లు వచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది హైదరాబాద్‌కు చెందిన కార్పొరేట్ సంస్థ ఈసీఐఎల్(ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్) నుండి రూ.34 లక్షలతో 500 డ్యూయెల్ డెస్కుల నిర్మాణానికి ఆర్డర్ తీసుకున్నారు. మొత్తం 31 మంది కార్మికులకు ఒక నెల చేతి నిండా పని లభించింది. మొదటి వాయిదా కింద పరిశ్రమకు 20 శాతం నిధులు ఖాతాలో జమచేశారు. మార్చిలో 300 డ్యూయెల్ డెస్కులు జిల్లాలోని వివిధ కేజీబీవీలకు తరలించారు. కార్మికులకు ఒక నెల జీతం చెల్లించారు. మరో 200 డ్యూయెల్ డెస్కులు ఏప్రిల్‌లోనే పూర్తిచేయగా వాటిని పంపిణీ చేసేందుకు సీఎఫ్‌సీ ఖాతాలో డబ్బులు లేక అవి పరిశ్రమలోనే ఉండిపోయాయి. ప్రస్తుతం పంపిణీ చేయాల్సినవి 200 డ్యూయెల్ డెస్కులు ఉన్నాయి. 31 మంది కార్మికులకు సంబంధించిన రెండు నెలల వేతనాలు చెల్లించాల్సి ఉంది. రెండు నెలలుగా పరిశ్రమలో పనులు లేక, రెండు నెలల జీతం రాక కార్మికులు దుర్భర జీవితాలను గడుపుతున్నట్లు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి ప్రభుత్వ ఆర్డర్లు కల్పించడంతో పాటు పెండింగ్ వేతనాలకు నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.


వేతనాలు జమ కాలేదు...

పెరుగు అశోక్, కార్మికుడు.



మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించిన వేతనాలు ఇప్పటికీ జమ కాలేదు. జీతాలు పడకపోవడంతో కుటుంబం గడవడం కష్టంగా మారింది. బయట కూలీ పనులకు వెళ్లి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం. అధికారులు స్పందించి పరిశ్రమపై దృష్టి సారించాలి. వేతనాలతో పాటు నూతన ఆర్డర్లు ఇవ్వాలి.

పరిశ్రమనే నమ్ముకున్నాం



పొచ్చు, వాచ్‌మెన్

30 ఏండ్ల నుండి సీఎఫ్‌సీ పరిశ్రమను నమ్ముకొని జీవనోపాధి పొందుతున్నాం. ఆర్డర్లు లేని రోజుల్లో తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని భరించాల్సి వస్తుంది. కరోనా సమయంలో ఏర్పడిన పరిస్థితులు మళ్లీ రాకుండా అధికారులు ప్రభుత్వ ఆర్డర్లు కల్పించాలి. ప్రభుత్వ ఆర్డర్లతో నిరంతరం ఉపాధి కల్పిస్తే కలెక్టర్, ఐటీడీఏ పీఓకు రుణపడి ఉంటాం. సకాలంలో వేతనాలు కూడా అందేలా చూడాలి.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
సోమవారం | అక్టోబర్ 07, 2024 | www.navatelangana.com

మాదిగ సంఘం కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం



మండల మాదిగ సంఘం కమిటీని ఆదివారం మాదిగ సంఘ పెద్దల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా కొండూకురి ప్రభుదాస్, ప్రధాన కార్యదర్శిగా జంగం రవి, ఉపాధ్యక్షులుగా బచ్చల కృష్ణ, కొండుకురి, కోశాధికారిగా మంద రాజేష్, ప్రచార కార్యదర్శిగా ముల్కల్ల రమేష్, సంయుక్త కార్యదర్శిగా మొలంగిరి చంద్రయ్య, సలహాదారులుగా కుంటాల దుబ్బయ్య, కత్తెరపాక రాజేష్ ఎన్నుకున్నట్టు ప్రకటించారు.

మెకానిక్‌ల నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-మంచిర్యాల



మంచిర్యాల టూ వీలర్స్ మెకానిక్స్ వర్కర్స్ నూతన సంఘం ఆదివారం ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షులుగా కర్జాకంటి రవీందర్, ప్రధాన కార్యదర్శిగా రామగిరి శ్రీనివాస్, కోశాధికారిగా అన్వర్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్ చారిలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు మెకానిక్ ల సంక్షేమం కోసం పని చేస్తమన్నారు. అనంతరం వారిని సత్కరించి అభినందలు తెలిపారు.

అపూర్వం పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-దండేపల్లి

మండలం కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1998-1999 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 26 ఏండ్ల తర్వాత ఒక్కచోట చేరిన వారిలో ఆనందం వెల్లివిసిరింది. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పట్లో పాఠశాలలో చదివిన మరుపురాని తీపి గుర్తులు నెమరేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఎవరెవరు ఎక్కడెక్కడ స్థిరపడ్డారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి చదువు చెప్పిన గురువులు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానంలో గౌరవాన్ని పొందినప్పుడే ఉపాధ్యాయులకు పూర్తి గుర్తింపు లభిస్తుందని, విద్యార్థుల ఉన్నతిని తెలుపుతుంటే చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రేమకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. అనంతరం గురువులను సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థికి సన్మానం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పొన్కల్ గ్రామపంచాయతీకి చెందిన గల్ఫ్ కార్మికుడు దుమల్ల ఎల్లయ్య చిన్న కుమార్తె దుమల్ల నాగమణి నీట్‌లో ఎంబీబీస్ సీట్ సాధించింది. ఆదివారం తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఉద్యమ నాయకులు మరిపెల్లి అంజయ్య, ఖాదర్ ఖాన్, ఎరుకల రమేష్ గౌడ్, భూతం శ్రీనివాస్, గొల్లపల్లి చంద్రమౌళి గౌడ్, మగ్గిడి తిరుపతి, హసన్, మెడిశెట్టి రవి, కలీమ్, హబీబ్, శేఖర్, సిహ్మారాజు ఆధ్వర్యంలో నాగమణితో తల్లిదండ్రులను శాలువా పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రుల కష్టాన్ని చూసిపెరిగిన దుమల్ల నాగమణి చిన్నప్పటి నుండే ఎలాగైన ఎంత కష్టమైన ఉన్నత శిఖరాలను అవరోదించాలని దానికనుగుణంగా కష్టపడి చదివి నీట్ ఎంబీబీఎస్ సీటు సాధించిందన్నారు. ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకొని ముందుసాగాలన్నారు. కార్యక్రమంలో గల్ఫ్ సంక్షేమ సమితి గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజుగౌడ్, ఇన్‌చార్జి మహమ్మద్ అలీం పాల్గొన్నారు.

పోలీస్ కళా బృందం ప్రదర్శన



నవతెలంగాణ-హాజీపూర్

మండలంలోని నమ్నూర్, గుడిపేట్ గ్రామాల్లో ఆదివారం రాత్రి పోలీస్ కళా బృందం ప్రదర్శన నిర్వహించారు. ఆత్మహత్యలు, మూఢ నమ్మకాలు, అసాంఘిక దురాచారాలు, గంజాయి, సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న దాడులపై పాటల రూపంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై గోపతి సురేష్ మాట్లాడుతూ యువత గంజాయి లాంటి చెడు వ్యసనాల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కళా జత బృందం, ఏఎస్సై చాంద్ పాషా, వొడ్డే బాల రాజు, బేర పోచయ్య, చెల్ల రమేష్ పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కో కన్వీనర్‌గా రవీందర్

నవతెలంగాణ-రెబ్బెన

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కోకన్వీనర్‌గా రెబ్బెన మండలం గోలేటి గ్రామానికి చెందిన దుర్గం రవీందర్‌ను నియమిస్తూన్నట్లు ఆ సంఘం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా దుర్గం రవీందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమకారుల పాత్ర కీలకమని అన్నారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో అనేక మంది యువతీయువకులు ప్రాణా త్యాగాలు చేశారని గుర్తు చేశారు. పోరాటాల ద్వారానే రాష్ట్ర సాధన సాధ్యమైందని తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేసే విధంగా కృషి చేస్తామన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కోకన్వీనర్‌గా నియమించిన రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

టీపీసీసీ చీఫ్‌ను కలిసిన కంది శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను ఆదివారం ఆదిలాబాద్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు.



ఎఫ్‌డీఓ పోస్టు భర్తీ ఎప్పుడో..?

- 11 నెలలుగా ఖాళీగా కీలక పోస్టు
- ఇన్‌చార్జి ఎస్‌ఆర్‌ఓలతో నెట్టుకొస్తున్న వైనం





నవతెలంగాణ-జన్నారం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పేరు గాంచిన అటవీ డివిజన్ అంటే జన్నారం అని అంటారు. మరోపేరు కవ్వాల్ టైగర్ జోన్ అంటే దేశంలో తెలియని వారు లేరు. దట్టమైన అటవీ ఉందంటే జన్నారం అటవీ డివిజన్ పరిదిలోనే ఉంది. దీన్ని కాపాడుకుంటేనే మండల ప్రజలకు మనుగడ ఉంటుంది. ఇంతటి కీలక డివిజన్‌లో నెలల తరబడి ఎఫ్‌డీఓ(ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్) పోస్టు ఖాళీగా ఉండడం ఇబ్బందికరంగా మారుతోంది. ఫలితంగా అటవీ సస్యరక్షణకు అవాంతరాలు తలెత్తుతున్నాయి. 11 నెలలుగా ఈ పోస్టు ఖాళీగా ఉండడంతో ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్‌ఓతోనే నెట్టుకొస్తున్నారు.

ఇష్టరీతిన వ్యవహరిస్తున్న సిబ్బంది

డివిజన్‌కు ఎఫ్‌డీఓ లేకపోవడంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని డివిజన్ ప్రజలు చర్చింకుంటున్నారు. 5 సంవత్సరాల పాటు ఇక్కడ ఎఫ్‌డీఓగా విధులు నిర్వహించిన మాద వరావు ఉన్న సమయంలో సిబ్బంది ఒక పద్ధతి ప్రకారం విధులు కొనసాగించారు. అటవీ సంపద ఇతర ప్రాంతాలకు తరలి పోకుండా చూసుకునే వారు. ఆ రకంగా ఉన్న సిబ్బంది ప్రస్తుత పరిస్థితుల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. విలువైన కలప తరలిపోతుంది. కలప అక్రమంగా తరలిస్తున్న సందర్భంలో కూడా సిబ్బంది చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఎఫ్‌డీఓ మాదవరావు బదిలీపై వెళ్లి 11 నెలలు గడుస్తున్నా ఇప్పటికి ఎవరిని నియమించలేదు.

ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్న వైనం

2023 అక్టోబరు 8న మాదవరావు రిలీవ్ కాగా అప్పటి నుండి ఇన్‌చార్జి ఎఫ్‌డీఓగా మంచిర్యాల జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్ వ్యవహరిస్తున్నారు. ఆయన జన్నారం డివిజన్‌కు ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు వెళ్తున్నారో తెలియని పరిస్థితి ఉంది. సమీక్ష సమావేశాలతో పాటు ఎవరైనా ఉన్నతాధికారి వస్తే తప్ప ఆయన డివిజన్‌లో తిరిగి అడవి ఎలా ఉందో తెలుసుకున్న దాఖలా లేవు. అదే విధంగా జన్నారం రేంజ్ ఎఫ్‌ఆర్‌ఓ ఉన్నా ఆయన సెలవుపై వెళ్లడం పరిపాటిగా మరింది. ఇప్పటికి రెండు సార్లు నెలల తరబడి ఎఫ్‌ఆర్‌ఓ లక్ష్మినారాయణ సెలవుపై వెళ్లడంతో ఇందన్‌పెల్ల ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్న హఫీజోద్దీన్ కొన్ని నెలల పాటు ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ప్రస్తుతం తాళ్లపేట ఎఫ్‌ఆర్‌ఓ సుష్మారావు జన్నారం ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టారు. డివిజన్ కేంద్రంలో నెలల తరబడి ఎఫ్‌డీఓ, రేంజ్ ఆఫీసర్లు లేకపోవడంతో డివిజన్ రేంజ్ కార్యాలయాలు వెలవెలబోతున్నాయి. బీట్ ఆఫీసర్ల నుండి సెక్షన్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ల పోస్టులు కొన్ని ఖాళీగా ఉన్నాయి. దీంతో ఒక్కో బీట్‌కు సెక్షన్లకు అధనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తే తప్ప పరిస్థితి మారదంటున్నారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన హేమలత సైతం సొంత పనులపై సెలవుపై వెళ్లారు. మంచిర్యాల జిల్లాలో నాలుగు అటవీ డివిజన్లు ఉండగా ఇందులో ముఖ్యమైంది జన్నారం డివిజన్ మాత్రమే. నాలుగు డివిజన్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన శివ ఆశిష్ సింగ్ జన్నారం డివిజన్‌కు ఇన్‌చార్జి ఎఫ్ఏఓగా ఉండడంతో కొంత భారంగా ఉన్న ఆకస్మిక తనిఖీలతో అప్పుడప్పుడు హడలెత్తిస్తున్నారు. నూతన ఎఫ్ఏఓ త్వరలోనే వస్తారని చెబుతున్నారు. కాని ఇంత వరకు ఎవరు రావడం లేదు.

ఎట్టకేలకు ఇంధన్‌పల్లి ఎఫ్‌ఆర్‌ఓ పోస్ట్ భర్తీ

రెండు సంవత్సరాలుగా ఇందన్‌పల్లి ఎఫ్‌ఆర్‌ఓ హఫీసోద్దీన్ ఇన్‌చార్జి అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఎట్టకేలకు ఆ ఖాళీని అటవీ అధికారులు భర్తీ చేశారు. మంచిర్యాల జిల్లా టాస్క్‌ఫోర్స్‌లో విధులు నిర్వహిస్తున్న కారం శ్రీనివాసును ఇందన్‌పల్లి ఎఫ్‌ఆర్‌ఓగా నియమిస్తూ అటవీశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందన్‌పల్లి ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్‌ఓగా పని చేసిన హఫీసోద్దీన్‌ను లక్షట్‌పేట ఎమ్మార్వోగా బదిలీ చేశారు. కారం శ్రీనివాస్ ఇందన్‌పల్లి ఎఫ్‌ఆర్‌ఓగా ఈనెల 9న బాధ్యతలు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు.

త్వరలోనే ఎఫ్‌డీఓ పోస్టును భర్తీ చేస్తాం

శివ్ ఆశిష్ సింగ్, డీఎఫ్‌ఓ



త్వరలోనే నూతన ఎఫ్‌డీఓ పోస్టులను భర్తీ చేస్తాం. పెద్ద డివిజన్ జన్నారం ఇక్కడ 11 నెలలుగా ఎఫ్‌డీఓ పోస్టు ఖాళీగా ఉంది. దీన్ని భర్తీ చేసేల ప్రతిపదనాలు పంపించాం. అటవీ సంరక్షణలో పూర్తి బాధ్యతగా విధులు నిర్వహించాలని అధికారులకు ఆదేశాలిచ్చాం. కలప స్మగ్లింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవు. అక్రమ రవాణపై సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

నిర్లక్ష్యం విలువ నిండు ప్రాణం

- సింగరేణి రైల్వే ట్రాక్ కోసం మట్టి తవ్విన కుంటలో పడి బాలుడు మృతి
- రైల్వే ట్రాక్‌పై బైటాయించిన గ్రామస్తులు



నవతెలంగాణ-జైపూర్

సింగరేణి అధికారుల నిర్లక్ష్యం నిండు ప్రాణాన్ని బలిగొంది. బర్రెలను మేపేందుకు ఆదివారం రైల్వే ట్రాక్ వైపు వెళ్లిన చిప్పకుర్తి రాజకుమార్(13) ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి మృతి చెందాడు. టేకుమట్ల గ్రామానికి చెందిన చిప్పకుర్తి విష్ణు రమాదేవి రెండవ సంతానమైన చిప్పకుర్తి రాజకుమార్ దిన చర్యలో భాగంగా బర్రెలు మేపేందుకు వెళ్లాడు. కాగా సింగరేణి సీఎస్పీ నుండి జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ వరకు ఏర్పాటు చేసిన రైల్వే ట్రాక్ నిర్మాణం కోసం మట్టి కుంటను తవ్విన యాజమాన్యం ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. సుమారుగా 20 అడుగుల లోతుతో తవ్విన కుంటలో ఇటీవల కురిసిన వర్షాలతో వరద నీరు వచ్చి చేరింది. బర్రెలను మేపుతూ నీటి కుంట వైపు వెళ్లిన రాజకుమార్ ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి మృతి చెందడం స్థానికులను కలిచి వేసింది. ట్రాక్ నిర్మాణం కోసం మట్టి తవ్విన అధికారులు కుంట చుట్టు కంచె ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో బాలుడు మృత్యువాతన పడ్డాడని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఒక ప్రాణం పణంగా పెట్టాల్సి వచ్చిందని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.



రైల్వే ట్రాక్‌పై బైటాయించిన గ్రామస్తులు

సింగరేణి రైల్వే ట్రాక్ నిర్మాణం కోసం మట్టి తవ్విన కుంటలో పడి మృతి చెందిన చిప్పకుర్తి రాజకుమార్ కుటుంబ సభ్యులతో కలిసి గ్రామస్తులు రైల్వే ట్రాక్‌పై బైటాయించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బాదిత కుటుంబంలో ఒకరికి సింగరేణి ఉద్యోగం ఇవ్వాలని, రాజకుమార్ కుటుంబానికి రూ. 50 లక్షల నష్టపరిహారం చెల్లించాలన్నారు. రాజకుమార్ మృతదేహంతో రైల్వే ట్రాక్‌పై సుమారు 4 గంటల పాటు బైటాయించారు. స్పష్టమైన హామీ ఇస్తే తప్ప రైల్వే ట్రాక్ నుండి మృతదేహాన్ని తీసేదిలేదని పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న ఎస్సై శ్రీధర్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను సముదాయించే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది.

ధర్మరావు పేటలో బతుకమ్మ చీరల పంపిణీ

నవతెలంగాణ-కాసిపేట

అధికారం ఉన్నా లేకున్నా పేదలకు ఆపదలో అండగా ఉంటామని, మహిళలు బతుకమ్మ పండుగ సంతోషంగా జరుపుకోవాలని ఉద్దేశంతో ప్రతి ఇంటికి బతుకమ్మ కానుక కింద చీరలను అందిస్తున్నామని రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ కుటుంబీకులు రుక్మిణి, పద్మజ, రోజమ్మ అన్నారు. ఆదివారం మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు స్వగ్రామం మండలంలోని దర్మరావుపేటలో రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ధర్మరావుపేట ఎంపీటీసీ పరిధిలో కొండాపూర్, తాటిగూడెం, కోనూరు, లంబాడీ తండా(డి) పంచాయతీలోని 1200 మంది మహిళలకు బతుకమ్మ చీరలను అందజేశారు. ప్రజల కోసం తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు వేముల కృష్ణ, మాజీ ఎంపీటీసీ పార్వతీ మల్లేష్, నాయకులు శేఖర్ రావు, గోపు శ్రీనివాస్, షాకిర్, నెరెల్ల రవి, చారీ, సది, కొప్పుల శంకర్, చంద్రయ్య పాల్గొన్నారు.



బాలికల రక్షణ అందరి బాధ్యత



నవతెలంగాణ-మంచిర్యాల

అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో వనిత వాక్కు ఆధ్వర్యంలో ఆదివారం దుర్గ మాత మహా సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వనిత వాక్కు సభ్యులు మాట్లాడుతూ బాలికలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు ఆగిపోవలని దుర్గ మాత మహా సంకల్ప యాత్ర నిర్వహించినట్లు తెలిపారు. మహిళలు, బాలికలను రక్షంచుకోవడం అందరి బాధ్యత అన్నారు. 108 కలశలతో దుర్గ మత పూజ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని విశ్వనాథ ఆలయం నుండి ఆర్‌బీహెచ్‌వీ పాఠశాల వరకు మహిళలు కోలాటంతో ర్యాలీ నిర్వహించారు. బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. బాలికల రక్షణకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహనా కల్పించారు. కార్యక్రమంలో వనిత వాక్కు ఫౌండర్ రంగు వేణు కుమార్, సభ్యులు జ్యోష్న, చంద్రథత్, కవిత, సునీత, శ్రీదేవి, మహిళలు పాల్గొన్నారు.

మొరం తరలిస్తున్న లారీల అడ్డగింత

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ముత్యంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గుండ్లపాడ్ శివారులోని గుట్టను జేసీబీ సహాయంతో మట్టి తవ్వకాలు చేస్తూ భారీగా లారీల్లో తరలించడంపై స్థానికులు మండిపడ్డారు. మాజీ సర్పంచ్, మాజీ ఉప సర్పంచ్, గ్రామస్తులు జేసీబీతో లారీల్లో మట్టి తరలింపు పనులు అడ్డుకున్నారు. ఇష్టానుసారంగా లారీల్లో మట్టిని తరస్తుండగా రోడ్డు పూర్తిగా ధ్వంసం అవుతుందని, ఇంత పెద్ద గుట్టను తవ్వడం ఏంటని ప్రశ్నించారు. మీకు అనుమతి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. గతంలో కూడా ఇక్కడ మట్టిని తీయగా స్థానికులు అడ్డగింతతో నిలిపివేశారు. కొన్ని నెలల తర్వాత అనుమతులు ఉన్నాయని జేసీబీతో లారీల్లో గుట్టను తవ్వి మట్టిని తరలించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైల్వే లైన్ పనుల కోసం మట్టిని తరలిస్తున్నామని, అనుమతులు ఉన్నాయని మట్టిని తరలించే నిర్వాహకులు తెలుపుతుండగా ఇలా గుట్టను తవ్వి ధ్వంసం చేయడం ఏంటని, రోడ్లు కూడా ధ్వంసం అవుతున్నాయని లారీలను అడ్డుకోవడంతో తరలింపును నిలిపివేశారు. ఇదిలా ఉండగా గుట్ట తవ్వకాలపై అనుమతులు ఇవ్వడంపై విమర్శలు వస్తున్నాయి. గుండ్లపాడ్ శివారులో భారీ వృక్షాలతో కూడిన పెద్ద గుట్ట ఉంది. ఇది ఫారెస్ట్ పరిధిలోకి రాకున్నా ప్రకృతి సహజతో కూడిన భారీ గుట్ట ఉంది. ఈ గుట్టకు మొరం మట్టి ఉండడంతో గతం నుంచి కూడా చాలా ఆక్రమణదారులు మట్టిని తరలించే ప్రయత్నాలు చేశారు. ఇలా చాలా సార్లు తవ్వకాలు చేయగా అప్పటికే గుట్టను తీవ్రంగా ధ్వంసం చేశారు. అనుమతుల్లో 189 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమి ఉందని స్థానిక అధికారులు నివేదిక ఇవ్వగా మొరం కోసం అదే సర్వే నెంబర్‌లో అనుమతులు ఇవ్వగా ఆ ప్రాంతంలో గుట్టను మాత్రమే తవ్వడంపై ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయమై తహసీల్దార్ భోజన్నను వివరణ కోరగా రైల్వే పనుల కోసం అత్యవసర నిమిత్తం ప్రభుత్వ భూమికి సంబంధించి వివరాలు అడగగా ముత్యంపల్లిలో 189 సర్వే నెంబర్‌లో ఉందని పంపడం జరిగిందని, ఈ మేరకు అనుమతులు వచ్చాయని పేర్కొన్నారు.

దేవాపూర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. దేవాపూర్-3 శక్తి కేంద్రంలో శక్తి కేంద్ర కన్వీనర్ రెడ్డి బాలరాజు, కోకన్వీనర్ వనిత ఆధ్వర్యంలో 12, 13 నెంబర్ బూత్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా బీజేపీ మండల అధ్యక్షుడు సూరం సంపత్ కుమార్ పాల్గొని మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి ప్రజలు బీజేపీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా తీసకుంటున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు దేవునుని సంతోష్, మండల కార్యదర్శులు రాంచందర్, సదయ్య, చొప్పదండి విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

అన్నపూర్ణ దేవి రూపంలో అమ్మవారి అలంకరణ

నవతెలంగాణ-జన్నారం

పట్టణంలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారు శ్రీఅన్నపూర్ణా దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా శ్రీ కనక దుర్గ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జయరాణి స్కూల్ సమీపంలో దుర్గామాత విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. శరన్నవరాత్రులు నాలుగో రోజు ఆదివారం అమ్మవారిని వేద పండితులు శ్రీ అన్నపూర్ణాదేవిగా అలంకరించి కుంకుమ పూజలు చేశారు. దాతలు ప్రజలకు అన్నదానం చేస్తున్నారు. అలాగే మండలంలోని బాదంపెల్లి దుర్గామాత అమ్మవారి మహిళలు పెద్ద ఎత్తున కుంకుమ పూజలు చేశారు. అనంతరం ఘనంగా దుర్గామాత బోనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. దుర్గామాత సేవా సమితి బాదంపెల్లి ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయం నుంచి దుర్గ మాత షేడ్ వరకు డప్పు సప్పుళ్ల మధ్య కళాకారుల పులి వేశాధారణలు, పిల్లల కోలాటాల మధ్య కనులపండువగా దుర్గ అమ్మవారి బోనలా యాత్ర కొనసాగింది. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కలను తీర్చుకున్నారు. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరానికి స్పందన

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని పల్సి(బి) గ్రామంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల చెందిన మహారాష్ట్ర బ్యాంకు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పల్సి(బి), పల్సి(బి) తాండ, కోసాయి, పల్సి(కె), దేగమా, కప్పర్‌దేవి గ్రామాల్లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో సుమారు 300 మందికి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని మహారాష్ట్ర బ్యాంకు ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి కాంతారావు అన్నారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ ఆల్ ఇండియా యూనియన్ వైస్ ప్రెసిడెంట్ కాడే స్వామి ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే యూనియన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా యూనియన్ యూత్ ప్రెసిడెంట్ ఎం.రవీందర్‌నాథ్, శేఖర్, పంచాయతీ కార్యదర్శి సచిన్, తలమడుగు శాఖ మేనేజర్ శ్రీకాంత్, శ్రీనివాస్, డాక్టర్లు విజయ సారథి, నిఖిల్, పిల్లల వైద్య నిపుణులు హేమలత, గైనకాలజిస్ట్ చరిత, గ్రామ మహాజన్ పటేల్, లచ్చారాం, పూసం బాపురావు, కిసాన్ మహారాజ్ పాల్గొన్నారు.